క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం



మాయలూరులో దరఖాస్తులు తీసుకుంటున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ : ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు 14 సంవత్సరాలు పైబడి వయస్సున్న బాలల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మాయలూరు, తడుమలదిన్నె గ్రామ సచివాలయాల్లో ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన కల్పించారు. వీరు 10వ తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు గ్రామ సచివాలయాలు, లేదా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 10వ తరగతిలో 5 సబ్జెక్ట్‌లు హిందీ మినహా పాస్ అయితే ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశానికి కూడా అర్హత పొందవచ్చునని ఎంఈఓ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఉయ్యాలవాడ : ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన అన్ని పంటలను రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించవలసిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందని మండల వ్యవసాయాధికారి రాజేంద్ర కుమార్ సూచించారు. గురువారం మండలంలోని ఇంజేడు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వర్షాధారంగా చిరుధాన్యాలైన కొర్రలు, అరికలు, నువ్వులు వంటివి రకాలు సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు 60 రోజుల నుంచి 70 రోజుల్లోపు దిగుబడులు చేతికి వస్తాయన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో చిరుధాన్యాలకు మంచి గిరాకీ ఉందన్నారు. రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, ఆధార్, పాస్ పుస్తకంతో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు మధులక్ష్మీదేవి, ఉద్యానవన శాఖ సహాయకురాలు భారతి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

చాగలమర్రి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న ముత్యాలపాడు బస్టాండు వీధికి చెందిన పక్కిరోళ్ళ మహబుబ్‌బాషా (34) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య ముగ్గురు కుమారైలు, కుమారుడు ఉన్నారు. వీఆర్‌ఏ మృతికి తహసీల్దారు సుభద్రమ్మ, డీటీ విజయ్ కుమార్, వీఆర్‌ఓలు శ్రీనివాసులు, శారదా, విశ్వనాథ్, వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ గఫార్ తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వ తక్షణ సాయం కింద రూ.25 వేలు, వీఆర్‌ఏల సంఘం తరఫున రూ.12వేలు తహసీల్దారు సుభద్రమ్మ మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

దొర్నిపాడు: ఉద్యోగులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫిట్‌మెంట్ 25 శాతం ఇవ్వడంతో ఉద్యోగులు గురువారం స్థానిక కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిమాటకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సీసీలు ఆల్ఫ్రెడ్, కృష్ణవేణి, మస్తానమ్మ, అకౌంటెంట్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకు నీరు విడుదల



అప్పనపల్లె వద్ద వాడుముఖం పట్టిన మొక్కజొన్న పైరు

రుద్రవరం: కొద్ది రోజులుగా వర్షం కురవకపోవడంతో పాటు ఎండలు పెరగడం, సాయంత్రం వేళల్లో వీస్తున్న గాలులకు మండలంలోని 21 పంచాయతీల పరిధిలో రైతులు సాగుచేసిన ఆరుతడి పంటలు వాడుముఖం పట్టాయి. పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం వెలుగోడు రిజర్వాయర్ నుంచి తెలుగుగంగ కాలువకు నీటిని విడుదల చేశారు. కాలువ ద్వారా వచ్చే నీటిని వాడుముఖం పట్టిన ఆరుతడి పంటలకు నీరు పారించుకోవాలని అధికారులు సూచించారు. వారం రోజుల పాటు మాత్రమే నీటిని విడుదల చేస్తామని, వరి పంట సాగుకు పూనుకోవద్దని చెప్పారు.

పంచ్ కొడితే.. పతకమే

- కరాటేలో సత్తా చాటుతున్న నంద్యాల చిన్నారులు
- జాతీయ స్థాయిలో పలు పతకాలు కైవసం
- క్రీడాకారులకు ప్రభుత్వ తోడ్పాటు





గోవాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన నంద్యాల క్రీడాకారులు (ఫైల్) శ్రీశైల పబ్లిక్ స్కూల్ ఆవరణలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): ఆత్మరక్షణ కోసం కొందరు.. హాబీగా ఇంకొందరు కరాటే నేర్చుకోవడం ప్రారంభించారు. అయితే ఆ క్రీడపట్ల రాను రాను వారిలో ఇష్టం పెరిగింది. అంతే అందులో కఠిన శిక్షణ తీసుకుంటూ వివిధ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో విజయం సాధిస్తూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు. ఎంతలా అంటే.. పాల్గొన్న ప్రతి పోటీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచేంతలా పోరాడుతున్నారు. పంచ్ విసిరితే పతకమే అనేంతలా.. ఆడి, గెలిచి చూపుతున్నారు. కాగా..మిగిలిన క్రీడలతో పోలిస్తే కఠోరమైన శిక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణతో కూడుకున్న ఈ విద్యలో రాణించడం అంత సులభం కాదని క్రీడా విశ్లేషకులు అంటున్నారు.

పోటీలు.. పతకాలు..

- జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్-2023 పోటీల్లో నంద్యాలకు చెందిన బ్లాక్ బెల్ట్ గ్రాండ్ చాంపియన్‌షిప్‌లో మొదటి స్థానంలో అయాన్, సైజునుల్లా, విసెట్‌జాన్, హారిక, హుసేన్, రామ్‌తేజ, శంషాద్, భవిశ్య, రెండవ స్థానంలో లావణ్య, మూడవ స్థానంలో లత విజయం సాధించి పతకాలు కైవసం చేసుకున్నారు.
- అండర్-8, 10, 12 విభాగాల్లో వీరితో పాటు శ్రీరామమాన్వి, శ్రీరామనిహా, భానుతేజ, అఫ్జల్, రులాయత్, ఇస్రాత్ పతకాలు సాధించారు.
- నెల్లూరులో జరిగిన నోబుల్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డు పోటీల్లో స్థానం సంపాదించారు.
- భారత్ బుక్‌ఆఫ్ రికార్డు పోటీల్లో రెండు నిమిషాలకు 200 మంది పోటీల్లో పాల్గొనగా 36వేల రెన్యూవ్ స్ట్రిక్‌ను మోకాలితో కొట్టి విజయం సాధించారు.
- గుంటూరులో జరిగిన సీఎం కప్ కరాటే పోటీల్లో విజయం సాధించారు.
- సిటోరియో కరాటే ఇండియా పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు.
- గత నెల కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బహుమతులు సాధించారు.

చదువుతో పాటు శిక్షణ..

విద్యార్థులు చదువుతో పాటు కరాటే శిక్షణలో ప్రతిభ చూపుతున్నారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విజయం సాధించిన వారందరూ విద్యార్థులే. వీరందరూ ఆయా పాఠశాలలో, కళాశాలలో చదువుకుంటూనే సాయంత్రం వేళల్లో శిక్షణ పొందుతున్నారు. పలు పోటీల్లో పతకాలు సాధించి మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

ప్రభుత్వ తోడ్పాటు..

క్రీడాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ద్వారా క్రీడలకు సంబంధించిన శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు జగనన్న క్రీడా సంబరాల పేరుతో ఆయా మండల జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇతర జిల్లాల క్రీడాకారులు ఇక్కడ బస చేసినప్పుడు భోజన వసతి దాతల సహకారంతో నిర్వహించేవారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రీడాకారులకు అల్పాహారం, మధ్యాహ్నభోజనం, సాయంత్రం స్నాక్స్‌తో పాటు గుడ్డు, పాలు వంటి పౌష్టికాహారం ప్రభుత్వమే అందిస్తుంది.

క్రీడలతో మంచి భవిత



కరాటేలో చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగాలు సాధించడంతో పాటు మంచి భవిష్యత్తు ఉంటుంది. సుమారు 100మంది నా వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. కరాటేతో శరీర దృఢంతో పాటు మనోధైర్యం కలుగుతుంది. గతంలో పోలిస్తే ఇప్పుడు అన్ని విభాగాల్లోను బాలురు కంటే బాలికలే ముందంజలో ఉన్నారు.

–నూర్‌బాషా, కరాటే మాస్టర్, నంద్యాల

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠోత్సవ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండలంలోని పుసులూరు గ్రామంలో గురువారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కరుణ్మయ విద్యాసంస్థల చైర్మన్ దండె దస్తగిరి, గోపిశెట్టి ప్రసాద్, నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

స్వామిరెడ్డి ఆశయాలు సాధిస్తాం

నంద్యాల(న్యూటౌన్): స్వాతంత్ర్య సమరయోధులు, ఉమ్మడి జిల్లాల భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి స్వామిరెడ్డి ఆశయాలను సాధిస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో స్వామిరెడ్డి 42వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం లాంటి ఉద్యమాల్లో పాల్గొని 1952లో 16 నెలల జైలుశిక్ష అనుభవించారని గుర్తు చేశారు. నాయకులు రియాజ్, సోమన్న, సుబ్బరాయుడు, హరినాథ్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే శ్రీరామరక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని, ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో రూ.5 కోట్లతో బీటీ రోడ్లు, వంతెనలు నిర్మించామని చెప్పారు. సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున,పకడ్బందీగా అమలవుతున్నా ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.బాబులాల్, కన్వీనర్ కుమార్ రెడ్డి, నాయకుడు నరసింహారెడ్డి, ఎంపీపీలు గజ్జెల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, ఉపాధ్యక్షుడు ముల్లా రఫి, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్ ఉన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఈనెల 19వ తేదీన సర్పంచ్, 19 వార్డు మెంబర్లకు జరగనున్న ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి, ఆర్‌డీఓ శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశం భవనంలో పోలింగ్ నిర్వహణపై గురువారం ఎన్నికల విధులకు హాజరయ్యే ఆర్వోలు, పీఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సకాలంలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎన్నికల సామగ్రిని సరి చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బేతంచెర్ల ఎంపీడీఓ వెంగన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం




ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: కోటకందుకూరు సర్పంచ్ ఉప ఎన్నిక ప్రచార పర్వం గురువారం సాయంత్రం ముగిసింది. వివిధ పార్టీలు బలపరిచిన అభ్యర్థుల తరఫున నాయకులు ప్రచారం చేశారు. చివరిరోజు నాయకులందరూ గ్రామంలో పర్యటించడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి లక్ష్మిదేవి గంప గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. ఈయన వెంట ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, నాయకులు రామకృష్ణ, కొలిమి బాషా, దాదాపీర్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

రుద్రవరం: మండలంలోని పేరూరు పంచాయతీ 5వ వార్డు స్థానానికి సంబంధించిన ఉప ఎన్నికల ప్రచారం గురువారం ముగిసింది. మూడు రోజులుగా అభ్యర్థులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు లక్ష్మిదేవి గెలుపుకోసం నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు కలిసి ప్రెస్‌కుక్కర్ గుర్తుకు ఓటేయాలని వార్డులో పర్యటించి అభ్యర్థించారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాలటౌన్: ఆశా కార్యకర్తలు నిబద్ధతతో పని చేస్తూ ప్రజారోగ్యాన్ని రక్షించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. గురువారం నూతనంగా నియమితులైన ఆశా కార్యకర్తలకు స్థానిక కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సేవలో ఆశా కార్యకర్తల పాత్ర ముఖ్యమైనదని క్షేత్రస్థాయిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించటం, బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి వారికి వైద్య సేవలు అందించడంలో ప్రధాన పాత్ర వహిస్తారన్నారు. శిక్షకులు ప్రతిభ, స్వర్ణ గౌరీ, సరళ గంగ, డీసీఎం వీరన్న పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



డీడీటీ మందు కలుపుతున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో దోమల నివారణకు వైద్యబృందం చేపట్టిన చర్యలను జిల్లా మలేరియ అధి కారి కామేశ్వర రావుగురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దోమలు నివారించకోవడానికి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవా లని గూడెం వాసులకు వివరించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, ఎంపీహెచ్ఈఓ నాగప్రసాద్, కోటకొండ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నై వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లను పొడిగించండి



మనీష్ అగర్వాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి

బొమ్మలసత్రం: ప్రయాణికుల సౌకర్యార్థం నంద్యాల నుంచి చెన్నై వరకూ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పొడిగించేందుకు చర్యలు తీసుకోవాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌ను కోరారు. గురువారం డీఆర్‌ఎం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా నంద్యాలలో ఎంపీ పోచాను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లా ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్ల పొడిగింపుపై డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేశారు. కొలూరు గ్రామం వద్ద ఉన్న రైల్వే గేటు వద్ద బ్రిడ్జీ ఏర్పాటు చేయాలని కోరారు. మైసూర్ నుంచి రేణిగుంట వరకు ప్రయాణిస్తున్న వారంతపు ఎక్స్‌ప్రెస్ రైలును నంద్యాల వరకు పొడిగించాలని కోరారు. అలాగే విశాఖపట్నం నుంచి కడప వరకు నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును నంద్యాల వరకు పొడిగించాలని విన్నవించారు. బనగానపల్లె, కోవెలకుంట్ల రైల్వే స్టేషన్లలో రిజర్వేషన్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గుంతకల్లు – డోన్ ఎక్స్‌ప్రెస్ రైలును ధర్మవరం వయా నర్సాపురం వరకు పొడిగించాలని విన్నవించారు.

చెంచు గిరిజనులకు జాబ్‌కార్డులు

ఆత్మకూరు: మండలంలోని అన్ని చెంచుగూడేల్లోని గిరిజనులు ఉపాధి పనులకు వెళ్లేలా జాబ్‌కార్డులు మంజూరు చేస్తామని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చెంచు గిరిజనులకు జాబ్‌కార్డులు, ఉపాధి పనులపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులో నలుగురి కంటే ఎక్కువగా ఉంటే అందులో అందరికీ కూలీ పని కల్పించడమే కాకుండా, వివాహం కాని చెంచు గిరిజనులకు కొత్త జాబ్‌కార్డు కూడా మంజూరు చేస్తామన్నారు. గిరిజన గూడేల్లో 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డుతో పాటు పనులు కల్పిస్తామని చెప్పారు.

రోడ్డుప్రమాదంలో వ్యకికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని అయ్యవారికోడూరు–కొత్తపల్లి మార్గంలో గురువారం రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. ఈర్నపాడు గ్రామానికి చెందిన మహమ్మద్ ఇంటికి వెళ్తుండగా బైక్ టైరు పంక్చర్ కావడంతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో మహమ్మద్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆటోలో నంద్యాల ఆస్పత్రికి తరలించారు.

జీవో రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జీఓ నంబర్ 223ని రద్దు చేయాలని పీఆర్‌టీయూ నాయకుడు భూమరాజు సురేష్‌కుమార్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయులకు రావాల్సిన 40శాతం కోటా పదోన్నతులకు అడ్డంగా ఉందని, రద్దు చేయాలన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కృష్ణారావు, విజయరావు, జగదీష్, శ్రీనివాసులు, షడ్రక్, సికిందర్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఐసీడీఎస్ పరిరక్షణ కోసం అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మాదిరిగానే ఇక్కడ కూడా వేతనాలు పెంచాలన్నారు.

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో వెలిసిన శ్రీ విశేష నాగులకట్ట ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ రామ తీర్థం పుట్టాలమ్మ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ భీమునిపల్లె వెంకట సుబ్బయ్య, 6వ వార్డు కౌన్సిలర్ పురందర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మశ్రీ మాడుగుల నాగేంద్ర శర్మ పర్యవేక్షణలో పుట్టాలమ్మ వారికి శ్రీ మహాగణపతి పూజ, జలాదివాసం, పంచామృతాభిషేకాలు, నవగ్రహ పూజలు, పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిపించారు.

ఆధ్యాత్మికం

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ లవన్న, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

శ్రీశైలంలో శివచతుస్సప్తాహ భజనలు



శివ సప్తాహ భజనలను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: పవిత్రశ్రావణమాసంలో శివనామ స్మరణ అత్యంత శ్రేష్ఠమైనది. లోకకల్యాణం కోసం ప్రతి సంవత్సరం శ్రావణమాసం శ్రీశైలదేవస్థానం శివచతుస్సప్తాహ భజనలు నిర్వహిస్తోంది. గురువారం ఈ భజనలను అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ, స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా విశేషపూజలు జరిపించారు. అనంతరం పంచాక్షరీ నామ భజన ప్రారంభించారు. ఆలయప్రాంగణంలోని వీరశిరోమండపంలో సెప్టెంబర్ 15వ తేదీ వరకు రేయింబవళ్లు ఈ భజనలు కొనసాగుతాయి. కర్నూలు నగరానికి చెందిన 5 భజన బృందాలకు, కర్ణాటకకు చెందిన రెండు భజన బృందాలకు శ్రావణమాసంలో శివభజనలు చేయడానికి దేవస్థానం అవకావం కల్పించింది. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ఈఓ ఎస్ లవన్న పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆత్మకూరు/కొత్తపల్లి: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ప్రభాకర్ రెడ్డి, మంజునాథ్, నరసింహ, ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు అన్నారు. మండలంలోని బాపనంతపురం, నల్లకాల్వ, కరివేన, శ్రీపతిరావు పేట, కొత్తపల్లి మండలంలోని నందికుంట, బావాపురం గ్రామాల్లో మొక్కజొన్న పంటను గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న వర్షాభావ పరిస్థితుల వలన ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. దిగుబడి గణనీయంగా తగ్గే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇందుకు రైతులు నీటిలో కరిగే ఎరువులు మల్టీ–కే 19:19:19ను పదిగ్రాముల చొప్పున నీటిలో కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. పొలాల్లో జింక్, లూజీమచ్చ తెగులు అధికంగా ఉన్నాయని ఇందుకు 50 కేజీల యూరియను వేయాలన్నారు. నేలలో తగినంత తేమ శాతం ఉన్నప్పుడు 50 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ అందిచాలని సూచించారు. ఇతర వివరాలకు సమీపంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.



కుందూలో పారుతున్న నీరు



క్రిష్టిపాడు వద్ద మిరప నాటుతున్న కూలీలు

విస్తారంగా మిరప సాగు

దొర్నిపాడు: మండలంలో మిరప నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కేసీ, కుందూకు నీరు వదలండంతో నాట్లు వేగవంతం చేశారు. గతేడాది మండలంలో 6,500 హెక్టార్లలో మిరప పంట సాగు చేశారు. నిరుడు మంచి ధర లభించడంతో లాభాలు గడించారు. దీంతో మరింత మంది రైతులు మిరప పంట సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గతేడాది కన్నా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముందని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.